నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, శుక్రవారం 24 మే 2024 | NIZAMABAD



మోపాల్ మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో ఎండుతున్న మొక్కలు

- నిర్వహణ లేక ఎండిపోతున్న మొక్కలు
- నీళ్లు లేక, రక్షణ చర్యలు కరువై కళావిహీనం
- పచ్చదనం పరిరక్షణలో అడుగడుగునా లోపాలు
- స్పెషల్ ఆఫీసర్ల తీరుతో గ్రామాల్లో పాలన గాలికి

**అటవీ విస్తీర్ణం 33శాతం** పెంచాలనే కృతనిశ్చయంతో 2015లో మొదలైన హరితహారం కార్యక్రమ లక్ష్యం ప్రభుత్వం మారడంతో నీరు గారుతున్నది. ఐదు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారుతో ఎటు చూసినా కళావిహీనమైన దుర్భర పరిస్థితులే గోచరిస్తున్నాయి. గతంలో విజయవంతంగా అమలైన మొక్కల పెంపకం ఇప్పుడు గాలికి వదిలేసినట్లుగా మారింది. హరితహారం కోసం గ్రామాల్లో ట్రాక్టర్, నీటి ట్యాంకర్‌ను ఏర్పాటు చేసి ప్రత్యేక వ్యవస్థను తీర్చిదిద్దగా ఇప్పుడంతా డొల్లగా మారింది. మండుటెండల్లో తడి లేక మొక్కలన్నీ ఎండిపోతున్నా స్పందించే వారు కరువయ్యారు. రక్షణ చర్యలు కూడా లేకపోవడంతో పశువులకు మేతగా మారిపోతున్నాయి. గతంలో కోట్లాది మొక్కలను నాటగా గ్రామాల్లో దారి పొడవునా స్వాగత తోరణాలుగా దర్శనం ఇచ్చిన చెట్లు బోసిపోతున్నాయి. పట్టణాలు, నగరాల్లోనూ ఇదే దుస్థితి నెలకొన్నది. స్థానిక సంస్థలకు ప్రత్యేకంగా అదనపు కలెక్టర్ స్థాయి అధికారిని ప్రభుత్వం గతంలో నియమించింది. గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దేందుకు ఈ ప్రయత్నం చేయగా పర్యవేక్షణ లోపంతో నిజామాబాద్ జిల్లాలో ఎటు చూసినా మొక్కలన్నీ మోడుబారి దర్శనం ఇస్తున్నాయి. పంచాయతీ శాఖ పర్యవేక్షణ లోపాన్ని ప్రస్ఫుటంగా తేటతెల్లం చేస్తున్నది.

–నిజామాబాద్, మే 23(నమస్తే తెలంగాణ ప్రతినిధి)

## హరితహారం

# వ్యర్థ భరితం

నమస్తే తెలంగాణ ఫోకస్

నాడు




నేడు



పాత డీఈవో ఆఫీసు వద్ద పరిస్థితి..



జీజీ కాలేజీకి వెళ్లే రోడ్డు పక్కన ఎండిన మొక్క



లలితాదేవీనగర్, రెండో బస్‌డిపో వద్ద..





నిజామాబాద్ నగరంలోని లలితాదేవినగర్‌లో ఎదగని హరితహారం మొక్కలు

నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలో పార్కులు, ఖాళీ ప్రదేశాలు, రోడ్డుకు ఇరువైపులా హరితహారం పథకంలో భాగంగా మొక్కలు నాటారు. ఇందులో గత ప్రభుత్వం చర్యలతో కొన్ని బతికి ఏపుగా పెరిగాయి. గతేడాది కాలంగా నాటిన మొక్కల పరిస్థితి గందరగోళంగా మారింది. వాటి నిర్వహణలో లోపంతో అవి ఎండిపోతున్నాయి. ఏపుగా పెరగలేక సగానికి ఆగిపోతున్నాయి. పశువులు, మేకలకు మేతగా మారి ఆనవాళ్లు లేకుండా పోతున్నప్పటికీ నగరపాలక సంస్థ అధికారుల్లో మాత్రం చలనం రావడం లేదు. కార్పొరేషన్‌కు పూర్తిస్థాయి కమిషనర్ నియామకం జరిగినప్పటికీ పురపాలక సంస్థలో ఆవహించిన నిర్లక్ష్యం మాత్రం పోవడం లేదు. ఆకస్మిక పర్యటనలు, తనిఖీలు చేపడితే కింది స్థాయి సిబ్బందిలో పని పట్ల బాధ్యత పెరిగే అవకాశం ఉంటుంది. ఉన్నతాధికారులే పట్టింపులేనితనంగా ఉండడంతో మిగిలిన వారంతా తమకేం సంబంధం అన్నట్లుగా టైం పాస్ చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మారుతీనగర్, గంగస్థాన్ ఫేజ్ 1, ఫేజ్ 2, గూపన్‌పల్లి, వినాయక్‌నగర్, ఆర్యనగర్, ప్రగతినగర్‌లో రోడ్ల వెంట మొక్కల ఆనవాళ్లు పూర్తిగా తొలగిపోయాయి. ఆయా చోట్ల వాకర్స్ చొరవ తీసుకుని ఉదయం పూట మొక్కలకు నీళ్లు పట్టడంతో ప్రాణం పోసుకుంటున్నాయి. వాకర్స్‌కు ఉన్న శ్రద్ధ కూడా నగరపాలక సంస్థకు లేకపోవడం విడ్డూరంగా మారింది.

### నీరుగారుతున్న హరిత లక్ష్యం...

పచ్చదనం ప్రగతికి ఇంధనం. ఆహ్లాదానికి ఆలవాలం. ఈ విషయాన్ని గుర్తించే గత ప్రభుత్వంలో హరితహారం కార్యక్రమాన్ని కేసీఆర్ తీసుకువచ్చారు. తెలంగాణకు పచ్చని అందాలను అద్దారు. తొమ్మిది విడుతలుగా దిగ్విజయంగా కార్యక్రమాలను చేపట్టి సత్ఫలితాలను తీసుకు వచ్చారు. జీవ వైవిధ్యానికి బలమైన పునాది వేసిన హరితహారంలో అత్యధిక మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ఎల్లవేళలా కృషి చేశారు. రాష్ట్రంలో అడవుల శాతాన్ని పెంచడానికి, గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో పచ్చగా ఉండేందుకు, ఆహ్లాదకర వాతావరణం అంతటా విస్తరించేందుకు హరితహారం ఎంతో దోహదం చేసింది. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ఎటు చూసినా పచ్చదనానికి, ఆహ్లాదకర వాతావరణానికి జీవం పోస్తే ఇప్పుడు అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం నిర్లక్ష్యం వ్యవహిస్తూ హరితహారాన్ని హరిస్తున్నది. పట్టింపులేనితనంతో అమూల్యమైన హరిత లక్ష్యం నీరుగారుతున్నది. హరితహారం మొక్కల పెంపకంలో ఎటు చూసినా నిర్లక్ష్యం తాండవిస్తుండడంతో గ్రామాలు కళావిహీనంగా మారుతున్నాయి.

### నర్సరీల నిర్వహణ గాలికి...

హరితహారం ప్రారంభమైన సమయంలో మొక్కలు అందుబాటులో లేకపోయేవి. ప్రైవేటు నర్సరీల్లో కొనుగోలు చేసి నాటడం భారీ తంతుగా ఉండేది. దీంతో ఖర్చును నిలువరించేందుకు గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రభుత్వ ఖర్చుతోనే నర్సరీలను గత సర్కారు ఏర్పాటు చేసింది. ఇది వరకు కొన్ని చోట్ల మాత్రమే నర్సరీలు ఉండేవి. నాలుగేండ్ల క్రితం ప్రతి గ్రామానికి నర్సరీని ఏర్పాటు చేశారు. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా వన నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలను పెంచుతున్నారు. జిల్లాలో 530 గ్రామ పంచాయతీల్లో వాటిని ఏర్పాటు చేయగా, పురపాలికల్లో సైతం నర్సరీలను నిర్వహిస్తున్నారు. వీటిల్లో సుమారు కోటి మొక్కలను పెంచుతున్నారు. వానాకాలం ప్రారంభ సమయానికి హరితహారం కార్యక్రమంలో వీటిని నాటేందుకు వినియోగించే ఏర్పాటు చేస్తుండేది. అయితే ఇప్పుడు చాలా చోట్ల నర్సరీల నిర్వహణ గాలికి వదిలేశారు. పట్టించుకునే వారు కరువవ్వడంతో నర్సరీల్లో మొక్కల ఎదుగుదల లోపించి చేతికి రాకుండా పోతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. నీటి కొరత ఓ వైపు, సిబ్బంది లేమితో నర్సరీలు అస్తవ్యస్తంగా మారాయి.



సాందీపని డిగ్రీ కళాశాలలో పాలిసెట్ పరీక్షపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

# నేడే పాలిసెట్

- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- నిజామాబాద్‌లో 16, కామారెడ్డిలో 4 పరీక్షా కేంద్రాలు

కామారెడ్డి, మే 23: పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష(పాలిసెట్)కు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, పాలిసెట్ సమన్వయకర్త డాక్టర్ విజయ్‌కుమార్ గురువారం తెలిపారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో నాలుగు సెంటర్లలో మొత్తం 2,301 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని రెండు సెంటర్లలో 1200, సాందీపని డిగ్రీ కళాశాలలో 850, ఎస్‌ఆర్‌కే డిగ్రీ కళాశాలలో 251 మంది పరీక్ష రాయనున్నారని తెలిపారు. పరీక్ష ప్రారంభమైన తర్వాత నిమిషం ఆలస్యమైనా లోనికి అనుమతించబోమని అన్నారు. కేంద్రానికి వచ్చే అభ్యర్థులు హాల్‌టికెట్‌పై ఫొటో ముద్రించి ఉండకపోతే పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్షాకేంద్రాన్ని పాలిసెట్ స్పెషల్ అబ్జర్వర్లు భరత్, హరికృష్ణ పరిశీలించారు. వేసవి దృష్ట్యా విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. నిజామాబాద్ జిల్లాలో 16 పరీక్షా కేంద్రాల్లో 5,586 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, సమన్వయకర్త ఫణిరాజ్ తెలిపారు.

# జీజీహెచ్‌లో ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక సేవలు

ప్రారంభించిన జిల్లా జడ్జి సునీత కుంచాల



ఓపీ సేవలను ప్రారంభిస్తున్న జడ్జి సునీత కుంచాల

ఖలీల్‌వాడి, మే 23: రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ దవాఖానలో ట్రాన్స్‌జెండర్లకు ఓపీ సేవలు అందుబాటులోకి వచ్చాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. జీజీహెచ్‌లో గురువారం ఓపీ సేవలను ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. ట్రాన్స్‌జెండర్లు ఆరోగ్య సమస్యలను ఏ దవాఖానలో చూపించుకోవాలో తెలియక అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వారి కోసమే ఈ ఓపీ సెంటర్‌ను ప్రారంభించారన్నారు. జిల్లా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్ సంవత్సరంపాటు ఈ క్లినిక్ కోసం ఎంతో కష్టపడి పని చేశారని, ఆమె కష్టానికి ఫలితం దక్కిందన్నారు. ట్రాన్స్‌జెండర్లు, వారి కుటుంబ సభ్యులకు కూడా ప్రత్యేకమైన ఓపీ వైద్య సేవలందుతాయన్నారు. ఈ ఓపీ సేవలు జాన్ హాప్కిన్స్ విశ్వవిద్యాలయం అమెరికా, వైజీఆర్ సంరక్షణ, డీఎస్‌ఎల్‌ఏ సమన్వయంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ కోటేశ్వర్‌రావు, ట్రెయినీ ఐపీఎస్ శేషాద్రిరెడ్డి, స్నేహ, టీఐ ప్రాజెక్టు స్టాఫ్, ట్రాన్స్‌జెండర్లు, దవాఖాన సిబ్బంది పాల్గొన్నారు.

# ఇరువర్గాల ఘర్షణ



ఘర్షణలో గాయపడ్డ సమీర్

ఆర్మూర్‌టౌన్, మే 23: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో గురువారం రాత్రి ఇరువర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెర్కిట్‌కు చెందిన సమీర్ నుంచి అదే ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి అద్దెకు కారు తీసుకున్నాడు. తిరిగి ఇచ్చే సమయంలో కారు డ్యామేజ్ అయ్యిందని, బాగు చేయించి ఇవ్వాలని సమీర్ సూచించాడు. అదే విషయమై మాట్లాడుదామని పిలిపించిన ఆ వ్యక్తి సమీర్‌పై దాడికి దిగాడు. విషయం తెలుసుకున్న సమీర్ స్నేహితులు అక్కడికి చేరుకోవడంతో ఇరువర్గాల మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణ చోటు చేసుకున్నది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించారు. గాయపడిన క్షతగాత్రులను ఆర్మూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించి కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో రవికుమార్ తెలిపారు.

# డ్రాప్ చేస్తామని చెప్పి.. చోరీ

బాధితుడి కేకలతో పరారైన దొంగలు

నవీపేట,మే 23: బైక్‌పై మీ ఊర్లో దింపుతామని నమ్మించి.. రహస్యప్రాంతానికి తీసుకెళ్లి కత్తులతో బెదిరించి బాధితుడి వద్ద ఉన్న నగదును దోచుకెళ్లిన ఘటన బుధవారం రాత్రి నవీపేట మండలం పోతంగల్ గ్రామ సమీపంలో చోటు చేసుకున్నది. ఏఎస్సై మోహన్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నందిపేట మండలం తల్వేద గ్రామానికి చెందిన ఎర్రోల్ల సంజీవ్ వృత్తి రీత్యా డప్పులు కొడుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. బుధవారం ఉదయం మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ధర్మాబాద్ తాలూకాలోని ఆత్మూర్ గ్రామానికి డప్పులు కొట్టేందుకు వెళ్లాడు. వచ్చిన డబ్బులతో స్వగ్రామానికి బయల్దేరగా రాత్రి తొమ్మిదిన్నర గంటలకు నవీపేటకు చేరుకున్నాడు. అక్కడి నుంచి తల్వేద వెళ్లేందుకు నందిపేట్ వైపు వెళ్లే రోడ్డులో కూర్చొని ఉండగా ఇదే అదునుగా భావించిన ఇద్దరు గుర్తు తెలియని దుండగులు పథకం ప్రకారం బైక్‌పై సంజీవ్ వద్దకు వచ్చారు. బస్సులు, ఆటోలు లేవని నందిపేట్ వరకు డ్రాప్ చేస్తామని నమ్మబలికి బైక్‌పై సంజీవ్‌ను కూర్చోబెట్టుకొని బయల్దేరారు. పోతంగల్ సమీపంలోని ఓ మూతబడిన పౌల్ట్రీ ఫాం వద్దకు తీసుకెళ్లగా అక్కడే ఉన్న మరో దుండగుడితో కలిసి కత్తులతో బెదిరించి రూ. 3,800 నగదును లాక్కుంటుండగా సంజీవ్ కేకలు వేశాడు. గమనించిన ఇతర వాహనదారులు ఘటనా స్థలానికి చేరుకునే సరికి వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్, కత్తి, బైక్‌ను వదిలేసి దుండగులు పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని, దుండగులు వదిలివెళ్లిన వాహనంతోపాటు వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్సై తెలిపారు.

# గాలి వాన బీభత్సం

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు



సిరికొండ మండలం మైలారంలో..



గుడితండాలో గాలికి ఎగిరిపడ్డ ఇంటి పైకప్పు రేకులు

గాంధారి/ ధర్పల్లి(సిరికొండ) మే 23: ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. కామారెడ్డి జిల్లా గాంధారి మండలం గుడిమెట్ గ్రామంలోని పంట పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్‌తోపాటు మూడు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. బుధవారం వీచిన గాలులకు మామిడికాయలు నేలరాలాయి. నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం సీతాయిపేట్ గ్రామ పరిధిలోని గుడితండాలో గురువారం ఉదయం వీచిన ఈదురుగాలులకు ఓ ఇంటి పైకప్పు రేకులు ఎగిరివచ్చి అరకిలోమీటర్ దూరంలో పడ్డాయి. సిరికొండలో బుధవారం సాయంత్రం గాలివానకు పోలీస్ స్టేషన్ ఆవరణలోని బీఎస్‌ఎన్‌ఎల్ పాత టవర్ విరిగిపడింది. మైలారంలో నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు, పలు స్తంభాలు నేలకొరగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.



గుడిమెట్‌లో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

# అడుగంటిన పోచారం ప్రాజెక్టు

నాగిరెడ్డిపేట, మే 23: ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట మండలాలకు సాగు, తాగునీరు అందించే అన్నపూర్ణ పోచారం ప్రాజెక్టులో నీరు పూర్తిగా అడుగంటింది. ప్రాజెక్టులో చుక్క నీరు లేక వెలవెలబోతున్నది. గతేడాది సమృద్ధిగా వర్షాలు కురిసి పూర్తిస్థాయిలో నిండింది. దీంతో ప్రాజెక్టు కింద ఉన్న ఆయకట్టుకు వానకాలం, యాసంగి పంటలకు సరిపడా నీరు అందించగా.. పంటలు పండి రైతులు సంతోషంగా ఉన్నారు. ప్రస్తుతం పూర్తిగా అడుగంటిన ప్రాజెక్టును చూస్తున్న రైతులు ఈ యేడు కాలం ఎలా ఉండనున్నదోనని ఆశగా ఎదురుచూస్తున్నారు.



పూర్తిగా అడుగంటిన పోచారం ప్రాజెక్టు